క్లుప్తంగా

ఎంవీపీ రైతుబజార్‌లో స్మార్ట్ సిటీ స్టాల్



ఎంవీపీ రైతుబజార్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన స్మార్ట్‌సిటీ స్టాల్

ఆరిలోవ: జీవీఎంసీ అధికారులు ప్లాస్టిక్ వాడకం నిషేధంపై చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఎంవీపీ రైతుబజార్‌లో ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా స్మార్ట్‌సిటీ పేరిట ఓ స్టాల్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రైతుబజార్‌కు కూరగాయలు కొనడానికి వచ్చే వినియోగదారులకు జీవీఎంసీ సిబ్బంది రోజూ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించనున్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, పర్యావరణం పరిరక్షణ గురించి వివరించనున్నారు. ఈ స్టాల్ వల్ల ప్రజల్లో అవగాహన కలుగుతుందని భావిస్తున్నారు. త్వరలో ఈ స్టాల్ ప్రారంభం కానుందని రైతుబజార్ ఈవో వరప్రసాద్ తెలిపారు.

ఆశ్రమంలో దుస్తుల పంపిణీ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పరిధి డెయిరీ ఫారం సమీప ఇందిరానగర్‌లోని ఆనందమార్గ్ ఆశ్రమంలో పిల్లలకు ఆదివారం మార్వారీ యూత్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. నగరంలో ఐదుగురు మర్వారీ పిల్లల పుట్టిన రోజు ఆనంద మార్గ్ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పిల్లల తల్లిదండ్రులు ఆశ్రమంలో ఉన్న 40 మంది పిల్లలకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మార్వారీ యూత్‌కు ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద కృతజ్ఞతలు తెలిపారు.

'న్యాక్ గుర్తింపులో భాగస్వాములు కావాలి'

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యాయన కేంద్రానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ సిహెచ్.విష్ణు మూర్తి ఓ ప్రకటనలో కోరారు. దీనికి సంబంధించి విద్యార్థులకు వచ్చే ఈ-మెయిల్‌కు తక్షణమే స్పందించి సూచించాలని పేర్కొన్నారు. అందులో పొందుపరిచిన 20 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తమ మెయిల్‌ను తరచూ పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం సమీప రెండో బ్రిడ్జిపై మూడు వాహనాలు ఢీకొట్టిన ప్రమాదంలో ఒక మహిళకు గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదివారం సాయంత్రం గాజువాక నుంచి ఎన్ఏడీకి స్కూటర్‌పై వస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చింది. దీంతో వెనుక వస్తున్న కారు డ్రైవర్ తన వేగాన్ని తగ్గించాడు. కారు వెనుక వస్తున్న బొగ్గు లారీ కారును ఢీకొట్టడంతో అది ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో స్కూటర్ వెనుక కూరున్న వరలక్ష్మి కిందకు పడిపోవడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. స్థానికుల సహకారంతో గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు.

ఏయూ సమాచారమ్

సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగాలి

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్
- ముగిసిన హ్యాక్‌థాన్ కార్యక్రమం



విజేతలతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సవాళ్లను స్వీకరిస్తూ వాటికి పరిష్కారాలు చూపే దిశగా యువత పయనించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాక్‌థాన్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు రిజిస్ట్రార్ బహుమతులు ప్రదానం చేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం మార్గదర్శకంలో విద్యార్థులు నవ్య ఆవిష్కరణలు జరపాలని ఆయన సూచించారు.

విజేతలు వీరే...

హ్యాక్‌థాన్ విజేతల వివరాలను ప్రకటించారు. అల్టిమేట్ క్రియేషన్స్ సభ్యులు వి.మణికంఠ, పి.హరీష్, జి.అనీల్‌కుమార్, సిహెచ్.అశోక్, బి.భార్గవ్ ప్రథమ స్థానంలో, డాష్ సభ్యులు సుభాంగి సాహా, వై.శ్రీనివాస్, దర్శన్ శేరింగర్, అజయ్ శర్మ, హర్కీరట్ కౌర్ దాని ద్వితీయ స్థానం, ఇంట్-కాగ్నిటో బృందం ఆశిష్ సింగ్, మేఘన దత్త, భావన, దివోదశి సింఘలు తృతీయ స్థానంలో నిలిచారు. రఘు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన క్రియేటివ్ సీ కోడర్ సభ్యులు ఎం.ఎస్.సాయి నీరజ్, ఎల్.అమృత యశస్విని, పి.జగదీష్ ప్రత్యేక బహుమతిని సాధించారు. కార్యక్రమానికి డిజిఫాక్, సాండ్‌లాజిక్ టెక్నాలజీస్ సహకారం అందించాయి. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరప్రు, ఆల్‌కోవ్ పార్టనర్స్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ మాదాల, డాక్టర్ పి.రామరాజు, డాక్టర్ డి.లక్ష్మీపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్త జీవులపై కరుణ, ప్రేమ అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: జంతువుల పట్ల కరుణ-అహింసపై గాంధేయ-బౌద్ధ దృక్పథంపై గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో ఆదివారం ప్యానల్ చర్చ నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ క్యూరేటర్ ప్రొఫెసర్ పి.శంకరరావు ముఖ్యఅతిథి మాట్లాడుతూ సర్వ జీవుల పట్ల ప్రేమ, కరుణ చూపాలని గాంధీజీ సిద్ధాంతాలు తెలియజేస్తాయని చెప్పారు. ఆదివాసీ సంస్కృతిలో జంతువులను దేవతలుగా పూజించడం, వాటిని రక్షించే గొప్ప సంప్రదాయం ఎప్పుడూ ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ రచించిన 'బాపు కుక్కురిప శతకం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మహాత్మా గాంధీజీకి జంతువుల పట్ల ఉన్న అభిమానం, బౌద్ధ సన్యాసి కుక్కురిపా నుంచి ఆయన నేర్చుకున్న 108 కవితల సంకలనంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. విశాఖ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ కేర్ ఆఫ్ యానిమల్స్ ప్రెసిడెంట్ ప్రదీప్‌కుమార్‌నాథ్ మాట్లాడుతూ ప్రజలు విదేశీ కుక్కల జాతులను ఇష్టపడుతున్నారని, దేశీయ జాతులను రోడ్లపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాబోధి సొసైటీ స్థానిక అధిపతి ధమ్మాచారి విజయకుమార్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలు జంతువులతో సహా అన్ని జీవులపై ప్రేమ, కరుణ చూపించేలా ఉన్నాయన్నారు. గాంధేయ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ, శ్రీలంక బౌద్ధ సన్యాసి హేమసిరి థెరో, గాంధీ అధ్యయన వేత్త రావిప్రోలు సుబ్రహ్మణ్యం, డాక్టర్ కిశోర్ కుమార్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఐవైఆర్ కృష్ణారావు

ఎంవీపీ కాలనీ: బ్రాహ్మణులకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కోరారు. విశాఖ ప్రాంత బ్రాహ్మణ మేధావుల సమ్మేళనం ఆదివారం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జీవీఎల్ మాట్లాడుతూ బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరముందన్నారు. బ్రాహ్మణ సమాజం అంతా ఒకే వేదికపైకి వచ్చినప్పుడే అది సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులకు 3 శాతం ఓటు బ్యాంకు ఉందని, దాన్ని రాజకీయ ప్రాధాన్యం కోసం వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని అంశాల్లో అభివృద్ధి చెందడానికి సమష్టి కృషి అవసరమన్నారు. విజ్ఞానంలో ముందున్న బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. పలు పాలనపరమైన మార్పుల్లో భాగంగా ప్రభుత్వం రద్దు చేసిన అర్చకుల్లో వారసత్వాన్ని పునరుద్ధరించాలన్నారు. రాజకీయాల్లో వారసత్వాలు కొనసాగుతున్నప్పుడు అర్చకుల్లో వారసత్వాల కొనసాగింపులో సమస్య ఏముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఓలేటి పార్వతీశం, ద్రోణంరాజు శ్రీవాత్సవ, ఎంవీఆర్ కృష్ణప్రసాద్, ఎస్ఎస్ రావు, దశిక శ్రీనివాస్, తురగా శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఎంవీపీ కాలనీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ గెలుపునకు పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున కృషి చేయాలని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సూచించారు. ఆదివారం సాయంత్రం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఇటీవల భీమవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను పార్టీ శ్రేణులకు వివరించారు. దీంతో పాటు సంస్థాగతంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఎంపీ జీవీఎల్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా మాధవ్ గెలుపు కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణనకు ఒత్తిడి తేవాలని వినతి



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఎంవీపీ కాలనీ: బీసీ జనగణనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను బీసీ సంఘాల నాయకులు కోరారు. నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం విశాఖ వచ్చిన ఆయనను విమానాశ్రయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి అప్పారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోను బీసీ జనగణన చేపట్టాల్సిన అవసరముందన్నారు. బీసీ జనగణన కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీ మంత్రుల పర్యవేక్షణలో రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతికి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల గోవింద్, అప్పారి గిరిబాబు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మామిడి వేణుగోపాల్, గోవింద్, ప్రశాంత్, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమ్మేళనం



మాట్లాడుతున్న ప్రాంతీయ సంచాలకుడు నాగరాజు

సీతంపేట: దివ్యాంగులు ఆత్మన్యూనతా భావాన్ని పూర్తిగా విడనాడి అందరితో సమానంగా రాణించేలా ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమదృష్టి క్షమతా వికాసం(సక్షమ్) అనుసంధాన మండలి విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో దివ్యాంగుల సమ్మేళన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మున్సిపల్ పాలనాధికారి ప్రాంతీయ సంచాలకుడు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని పూర్తి స్థాయిలో పొందాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన దివ్యాంగులను, ఉన్నత స్థితి సాధించిన వారిని సన్మానించారు. సక్షమ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్సీపీసీ రిటైర్డ్ పౌర సంబంధాల అధికారి బి.హెచ్.విజయప్రసాద్, వెల్నెస్ ఓత్ స్థాపకుడు అవంతి, సక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.వి.ఎస్.ఎస్.మూర్తి, సభ్యుడు శ్రీధర్ పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవం



చాదర్‌ను తీసుకెళ్తున్న ముస్లింలు, చిన్నారులు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ మస్జీద్-ఈ-అల్‌ఖాదీర్ ఆధ్వర్యంలో ఆదివారం హజ్రత్‌ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ముస్లింలు మసీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. సాయంత్రం చిన్నారులు నాత్తే కళాములు ఆలపిస్తూ గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్ తదితర ప్రాంతాల్లో చాదర్‌తో చందనోత్సవ ర్యాలీ నిర్వహించారు. వేడుకల అనంతరం చాదర్‌ను అజ్మీర్ షరీఫ్ వద్ద హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ సమాధి వద్ద సమర్పిస్తామని మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు.

అ'పూర్వ' కలయిక



సమావేశమైన రైల్వే హైస్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: మర్రిపాలెంలోని రైల్వే హైస్కూల్‌లో 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో సందడి చేశారు. వన భోజన కార్యక్రమం జరుపుకొని ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. నగరంతో పాటు వివిధ చోట్ల స్థిరపడినవారంతా తమ కుటుంబాలతో ఇక్కడ కలిశారు. అందరూ సరదాగా ఆటపాటలతో గడిపారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

చిట్టివలస హైస్కూల్ విద్యార్థులతో డీఈవో చంద్రకళ



విద్యార్థులకు హాల్ టికెట్లు అందిస్తున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) శిక్షణను పూర్తి చేసుకున్న విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చిట్టివలస హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తి చేసుకున్న 9 నెలల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ఏడాది సొసైటీ నుంచి శిక్షణ పొందిన విద్యార్థుల్లో 9 మంది స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది 120 మంది విద్యార్థులు లాంగ్‌టెర్మ్‌లో శిక్షణ పొందినందున 70 మందికి పైగా విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు రూ.12వేలు వంతున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. విద్యార్థులకు అంకితభావంతో శిక్షణ అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులను ఆమె అభినందించి సన్మానించారు. అనంతరం ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్లు అందించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయులు బంటు అప్పారావు, పక్కి నాగేశ్వరరావు, వైవీ రమణ, ఎలమంచిలి జూనియర్ కళాశాల సూపరింటెండెంట్ జి.అప్పారావు, దయాసాగర్, డాక్టర్ ఆనంద్, వీటీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల అధికారి

మహారాణిపేట : పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా డి.సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారి పి.అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ తనను మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికైన అధ్యక్షుడిని రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అభినందించారు. ఎన్నికల పరిశీలకుడిగా విజయనగరం జిల్లా అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, విజయనగరం జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు సురేష్, సహాయ ఎన్నికల అధికారిగా యు. కూర్మారావు వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బీహెచ్‌వీ రమణబాబు, ఉపాధ్యక్షుడిగా ఆర్‌వీ నాగరాజు, యుఎస్‌వీ శ్రీనివాసరావు, ఎల్.పూర్ణయ్య, సంయుక్త కార్యదర్శులుగా కె.సత్యనారాయణ మూర్తి, కె.ఆనందకుమార్, వై.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డీవీఎస్ గౌరీపతిరావు, వి.రాధ, డి.కొండలరావు, జేసీసీ మెంబర్‌గా సీహెచ్ ఫ్లోరెన్స్ నైటింగేల్, స్టేట్ కౌన్సిలర్లుగా జి.గంగాధర్, ఎ.సత్యనారాయణ, సీహెచ్ సింహాచలం, జీఎల్ నరసింహం, కోశాధికారిగా ఎస్.త్రినాథ్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను, సీఈవోను మర్యాదపూర్వకంగా కలిసింది.

హిందూ ధర్మాన్ని కాపాడండి



వైద్యులతో సమావేశమైన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి



సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన వైద్యులు

- కంచి కామకోటి పీఠాధిపతి పిలుపు
- శంకర మఠంలో వైద్యులతో సమావేశం

సీతంపేట: సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో వైద్యులు భాగస్వాములు కావాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పిలుపునిచ్చారు. వైద్య వృత్తిలో కొనసాగుతున్న ఉన్నత వైద్యులతో శంకరమఠంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు వైద్యులకు కొన్ని సూచనలు చేశారు. వైద్య వృత్తిలో సంగీతం కూడా ఒక భాగమేనన్నారు. ఆస్పత్రిలోని రోగుల మనసు రంజింప చేసేందుకు, వారిలో ఆధ్యాత్మిక చింతన కలిగేలా భక్తి పూర్వక ప్రవచనాలను వినిపించాలన్నారు. గర్భిణులకు మన సంప్రదాయాలను, పురాణాలను అదేవిధంగా సంగీతాన్ని కూడా వినిపించ గలిగితే ప్రహ్లాదుడు వంటి మంచి ఉన్నత బుద్ధులు కలిగిన బిడ్డలు కలుగుతారని పేర్కొన్నారు. అటువంటి వారు హిందూ ధర్మాన్ని కాపాడే విధంగా ఉంటారని, అందువల్ల వైద్యులు ఆస్పత్రి యందు దేవాలయ ప్రాంగణంలో ఉండే విధంగా భక్తి పారవశ్యం కలిగించేలా రోగులను చూడాలన్నారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మఠం కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

వేటూరి పాటలు అజరామరం

సీతంపేట: తెలుగు భాష ఉన్నంత వరకు వేటూరి పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయని విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్ మాట్లాడుతూ 'సినీ కళామతల్లి నుదుట సింధూరం, అలనాటి వాగ్గేయకారులు త్యాగయ్య, అన్నమయ్య, భక్తరామదాసుల ఏక అవతారమే వేటూరి' అని కీర్తించారు. ఈ సందర్భంగా ఝుమ్మంది నాదం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. రాజేంద్రప్రసాద్, జ్యోత్స్న పాడిన రాగాల మేళవింపా.. రమేష్ పట్నాయక్, శృతి పాడిన వే వేళ గోపెమ్మలా.. ఎంవీఆర్ నాగేశ్వరరావు, సూర్య కుమారి పాడిన మనసులోని కోరిక.. జోగారావు, రచన శ్రీకృతి పాడిన స్వప్న వేణువేదో.. ఫణిభూషణ్, కల్యాణి పాడిన ఒకపూల బాణం.. ధీరజ్ పాడిన కంచికి పోతావా కృష్ణమ్మ.. ఫణిభూషణ్, దీప్తి పాడిన పూసింది పూసింది పున్నాగా.. శశిరాణి పాడిన ఓహో మేఘమాల వంటి ప్రజాదరణ పొందిన గీతాలతో అలరించారు. ఆత్రేయ పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కళారంగ ప్రముఖులు కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి,తిరుమలరావు, తదితరులు వేటూరి సేవలను కొనియాడారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో పేకాటరాయుళ్లు, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుగా పేకాటాడుతున్న 10 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి టీపీటీ కాలనీలోని ఓ గెస్ట్ హౌస్‌లో కొందరు పేకాటాడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వారు గెస్ట్ హౌస్‌పై దాడి చేసి అక్కడ పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,92,200 నగదుతోపాటు ఒక కారు, ఒక బైక్, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ద్వారకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా.. పోలీసులు కేసు నమోదు చేశారు.